ఆధునికానంతర సైన్స్ ఫిక్షన్ కథ...



పురాణపండ రంగనాథ్

"న్యూరాన్...

మెదడు భవనాన్ని నిర్మించిన జీవరసాయన భిత్తిక. డి.ఎన్.ఎ., ఆర్.ఎన్.ఎ. మెసెంజర్. ఆర్.ఎన్.ఎ. ఫొటోల సీమ. కాంతికణాలు భావాల దూరంలో బందీలై. అనుభవాల చిత్రాలు ప్రసవించే సుమకేదారం.

అన చేతన స్థితిలోకి అంతర్వలనం చెందిన మెదడు రసాయనాలు నిద్రవేళ పాదరసం తునకవలె కూనిరాగాలు తీసే నిశబ్దవేదిక.

అక్కడ కాలభంజికలు పగిలిపోతాయి. నిమిషాలు అనిమేషాలై చిట్లిపోతాయి. సెకనులు శకలవికలాలై అయస్కాంత తరంగాల్ని విద్యుత్తరంగాలై సవాల్‌చేస్తాయి.

అక్కడ అణువులు విచ్చుకుంటాయి. కణాలు పుష్పిస్తాయి. ఎలక్ట్రాన్‌లు అంగారపర్ణాలవుతాయి. తెరవలె విస్తరించిన అయస్కాంతశ్శక్తి, కెలిడోస్కోప్ చిత్రాల్లా సాలభంజికలు స్పర్శ సాక్షాత్కారం చేస్తాయి.

అక్కడ రాగద్వేషాల, సరిహద్దులు లేవు. సుఖదుఃఖాల ద్వంద్వాలు లేవు. అపురూపాలు, అపూర్వాలు అయిన ఒక కాల్పనిక లోకం అది. అలాంటి లోకం తనకు లేదే!" అనుకొంటోంది పరమ్ కంప్యూటర్!

అంతలోనే ఏమైంది.

"పరమ్" ప్రొఫెసర్ విశ్వామిత్ర పిలిచాడు.

"వూ!" అంది ఏడవ జనరేషన్ కంప్యూటర్. దానిపేరు పరమ్. అది మాట్లాడగలదు.

"మనిషి గురించి ఏం అనుకుంటున్నావ్?" విశ్వామిత్ర ప్రశ్నించాడు.

"పెద్ద బిచ్చగాడు అనుకొంటున్నాను"

"ఎలా చెప్పగలుగుతున్నావ్"

"మీరు నన్ను ఈ ప్రశ్నవేయడం సమాధానానికె బిక్షకాదా?"

"మన ఇద్దరి మధ్యా నువ్వు ఏ పోలికను అంచనా వేస్తున్నావ్?"

"మీరు మంచివారు. కొద్దిసేపే కోపం. తర్వాత అంతా మామూలే"

"మరి నీకు కోపం లేదుగా"

"ఎందుకు లేదు? మీరు తప్పుడు ఫీడింగ్ యిస్తే గిగో అని తిరస్కరించడం లేదూ? మీ మనుష్యుల ప్రవర్తనే మీరు మాకు కలిగించారుగా"

"రీజనింగ్ బాగానే ఉంది."

"అంతే కాదు సార్! మీరు మంచివారని నేను అనుకోవాలని మీ ఆలోచన. ఔనా?"

"ఎలా చెప్పగలవ్?"

"మీరు నాతో వాదించరు కనుక".

"నీతో వాదించనని ఎలా అనుకొంటున్నావ్?"

"నేనంటే మీకు చెప్పలేని భయం"

"అదేమిటి?"

"ఇంకోలా చెప్తాను"

"ఏమిటి?"

"లాజిక్. నేను మీకు భయపడుతుండాలని మీరు ఆశిస్తున్నారు. అదే మీకు ఆనందం. కానీ ఈ మాట పైకి అనడానికి ఏదో భయం ఉంది మీలో..."

"పరమ్, ఇన్ని మాటలు?"

"మీరు నేర్పించినవే. మెగా న్యూరాన్ కణాల చర్యల్ని గణిత శాస్త్రానికి అన్వయించి




నన్ను తయారుచేసారుగా."

"అయినా యింత విశ్లేషణ?"

"నాకు కల వచ్చింది సార్!"

"ఆ!"

"ఔను సార్! కలలో మా కంప్యూటర్లన్నీ బాధపడుతూ కనిపించాయి. మనిషి తమని మోసం చేశాడని అవి ఏడుస్తున్నాయి సార్!"

"పరమ్!"

"ఔను సార్. న్యూరాన్ సిలికాన్ చిప్స్ చేసి మీరు న్యూసిక్రాన్ చిప్ తయారుచేసారు. అది మాలో..." పరమ్ మాట పూర్తికాలేదు.

"అర్థమయింది పరమ్. న్యూసిక్రాన్ మైక్రో చిప్ మీలో విద్యుదయస్కాంత ఆవరణాన్ని ఏర్పరచింది. మనిషి మెదడుని ఆవరించి మనసు ఉన్నట్లు మీ సాఫ్ట్‌వేర్‌ని ఆవరించి ఈ శక్తి వుంది. అందుకే మీకు కలగనే స్థితి వచ్చింది."

"అంటే మాలో భావాలు ఉత్పన్నమవుతాయన్నమాట? మేం మనుషులతో సమానమవుతాం అన్నమాట" పరమ్ ఆనందంగా, తృప్తిగా అంటున్న మాటలు పూర్తికాలేదు... విశ్వామిత్ర తన దగ్గరున్న చిన్న డిస్క్‌ని కంప్యూటర్‌కి సెట్ చేసి స్విచ్ వేసాడు.

"పిచ్చి పరమ్! న్యూరాన్ ఎప్పుడు, ఎలా ప్రవర్తిస్తుందో మాకే తెలీదు. అది మీకు తెలిసిపోతే ఈ సృష్టిలో మనిషి ఆధిక్యత లేదు. ఈ డిస్క్ మీ సాఫ్ట్‌వేర్‌ని ఆవరించే విద్యుదయస్కాంత క్షేత్రాన్ని తటస్థీకరిస్తుంది. నా ప్రయోగ ఫలితం ఇదే. మెదడుకి, మనసుకి, మెషిన్‌కీ ఉన్న తేడాను నిరూపించడమే".

విశ్వామిత్ర అంతర్యం తెలిసి పరమ్ కంప్యూటర్ ఆ క్షణంలో కొంతసేపు గజిబిజికి లోనైంది. తనలోకి సాధారణ విద్యుత్తు ప్రసరించినప్పుడు ఆన్ అయి, బైనరీ సిస్టమ్ పని ప్రారంభించింది అనుకొంది... రేపు మరల విశ్రాంతి వేళ తను కలగనగలనని మౌనం వహించింది. మనిషి స్వార్థంలోని మాటల మెత్తదనం పరమ్‌కి అంతుబట్టలేదు. అది న్యూసిక్రాన్‌యే కానీ న్యూరాన్ కాదు. ●